సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ‌। 27 ‌। ఫిబ్రవరి ‌। 2023



మైదానం.. ఎప్పటికయ్యేనో..?

ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణ పనులు ఐదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి.

8లో



రామయ్యకు పుష్పార్చన..

భద్రాచలం సీతారామ చంద్రస్వామివారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు.

8లో

గరిష్టం / కనిష్టం
36° / 18°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఒడి బియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం జరిపారు.

రామయ్యకు తలంబ్రాల బియ్యం



బియ్యం అందజేస్తున్న రామభక్తులు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణం సందర్భంగా పంపిణీ చేసే తలంబ్రాల బియ్యాన్ని భక్తులు అందజేశారు. ఏపీలోని జంగారెడ్డిగూడేనికి చెందిన స్వామివారి భక్తులు ఆదివారం రామయ్యను దర్శించుకుని 80 క్వింటాళ్ల బియ్యాన్ని ఆలయ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అనిల్, నిరంజన్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) అశోకచక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు, ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన తొలుత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీకే ఓసీ–2 వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అధికారులు సీహెచ్ నర్సింహారావు, దుర్గం రాంచందర్, లక్ష్మీపతిగౌడ్, రాంబాబు, నర్సిరెడ్డి, వీరభద్రుడు, షబ్బీరుద్దీన్ పాల్గొన్నారు.

ఎండలోనే ‘ఉపాధి’..

- ఏటా వేసవిలో పని ప్రదేశాల్లో వసతులు కరువు
- టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో వడదెబ్బతో అవస్థలు
- జిల్లాలో పక్షం రోజులుగా పెరుగుతున్న కూలీల సంఖ్య
- ఈసారైనా నీడ, తాగునీరు ఏర్పాటు చేయాలని వేడుకోలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

చుంచుపల్లి: ప్రతి ఏడాది మండు వేసవిలో ఉపాధి హామీ పథకం కూలీలు బతుకు పోరాటం చేయాల్సి వస్తోంది. ఎండాకాలంలో పనుల ప్రారంభం నుంచే అధికారులు కూలీలకు కనీస వసతులు కల్పించాల్సి ఉంది. కొన్నేళ్లుగా జిల్లాలో అది ఎక్కడా కనిపించడంలేదు. దీంతో అసౌకర్యాల నడుమే పనులు చేయాల్సి వస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం పనిప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలి. కూలీలకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మెడికల్ కిట్లు, తాగునీరు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. కానీ జిల్లాలో ఎక్కడా ఈ సౌకర్యాలు కల్పించడంలేదు. దీంతో ప్రతి ఏటా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల్లో ఉపాధి పనులు చేస్తూ అవస్థలు పడాల్సి వస్తోంది. నీడ సౌకర్యం లేకపోవటంతో కూలీలు చెట్ల కిందనే సేదతీరుతున్నారు. గతంలో వేసవికాలంలో కొందరు కూలీలు వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురైన, మృతి చెందిన సంఘటనలూ ఉన్నాయి. కొన్నిచోట్ల మాత్రమే ఏళ్ల క్రితం పంపిణీ చేసిన పాత టెంట్లు, మెడికల్ కిట్లను ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఉదయం 8 గంటలలోపే పనులకు వెళ్లే ఉపాధి కూలీలు మధ్యాహ్నం 12 గంటలవరకు ముగించుకుని ఇంటికి వస్తుంటారు. కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో తమతోపాటు సీసాల్లో తీసుకెళ్తుంటారు. పనులకు ఉపయోగించే పలుగు, పారలకు రోజువారీ అలవెన్సులు, మంచినీటికి రూ.5 చొప్పున చెల్లిస్తున్నామని చెబుతున్నా అవి కూడా సకాలంలో అందిన సందర్భాలు లేవు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతాయని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు ఈ సారైనా పని ప్రదేశాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో 4.94 లక్షల మంది ఉపాధి కూలీలు

జిల్లాలో 2.25 లక్షల జాబ్‌కార్డులు ఉండగా వాటి పరిధిలో 4.94 లక్షల మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది 65.61 లక్షల ఉపాధి పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 44.30 లక్షలు పూర్తి చేశారు. ఇప్పటికే ఉపాధి పనుల నిమిత్తం రూ.104.58 కోట్ల నిధులను ఖర్చు చేశారు. కూలీలకు గరిష్ఠంగా రోజుకు రూ.245 వేతనం చెల్లిస్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాలుగైదు గంటలు కష్టపడుతున్నా సగటు కూలి రూ.150 నుంచి రూ.190 వరకు లభిస్తుంది. వేసవిలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 20 నుంచి 30 శాతం అదనంగా వేతనం చెల్లిస్తారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం ఉపాధిలో కొత్త సాఫ్ట్‌వేర్ తేవడంతో ఈ వేసవి భత్యం నిలిచిపోయింది. ప్రస్తుతం పూర్తిగా రద్దు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. వేసవి భత్యాన్ని నిలిపివేయడంతో గతేడాది ఉపాధి పనులపై కొంత ప్రభావం పడింది. వేసవి సీజన్‌లో జిల్లాలో ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. మార్చి నుంచి ఊపందుకుని, కూలీల సంఖ్య పెరుగుతుంటుంది. మే నెలలో లక్ష మంది వరకు పనులకు వస్తుంటారు. ఇందులో ఎక్కువ మంది మహిళలే ఉంటారు. ఈ ఏడాది కూడా పక్షం రోజులుగా ఉపాధి కూలీల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం 11,525 మంది పనులకు హాజరవుతున్నారు. రోజుకు వెయ్యిమంది చొప్పున కూలీలు పెరుగుతున్నారని అధికారులు చెబుతున్నారు. మార్చి మొదటి వారం నుంచి జిల్లాలో ఉపాధి కూలీల సంఖ్య మరింతగా పెరగనుంది.

వసతులు ఏర్పాటు చేస్తాం



జిల్లాలో ఇప్పుడిప్పుడే కూలీలు ఉపాధి పనులకు ఆసక్తి చూపుతున్నారు. ఈ వేసవిలో కూలీలకు ఎండ నుంచి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశిస్తాం.

– జి.మధుసూదన్‌రాజు, డీఆర్డీఓ

అనుదీప్ X వినీత్





నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ అనుదీప్.. ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదివారం కాస్త సేదతీరారు. మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ పార్కులో సింగరేణి, ఇతర అధికారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు రూ. 40 లక్షలతో ఫుట్‌బాల్ కోర్టు నిర్మించినట్లు తెలిపారు. కోర్టు నిర్వహణ బాగుండాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

–కొత్తగూడెంఅర్బన్

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు రాత పరీక్ష



పర్యవేక్షిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని ల్యాబ్ టెక్నీషియన్ టీ అండ్ ఎస్ గ్రేడ్ డి (ఇంటర్నల్) పోస్టుల భర్తీకి ఆదివారం కొత్తగూడెంలో రాత పరీక్ష నిర్వహించారు. 7 ఖాళీ పోస్టులుండగా, యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 42 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేయగా, 39 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య పర్యవేక్షించారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఫలితాలు ఆదివారం రాత్రి సింగరేణి ప్రధాన కార్యాలయం నోటీస్ బోర్డ్‌లో, సింగరేణి వెబ్‌సైట్‌లో అందుబాటులోఉంచుతామని జీఎం తెలిపారు.

ఇది హను కథ..

- మన గణేష్ టెంపుల్ గల్లీలోనే పెరిగాను
- దుర్గా టాకీస్‌లో చూసిన సినిమాతో లైఫ్ టర్న్
- నా ఊహల్లోంచి వచ్చిన ‘అందాల రాక్షసి’..
- సినిమా పేరుతో చదువును నిర్లక్ష్యం చేయలేదు
- ‘సాక్షి’తో సినీ దర్శకుడు హను రాఘవపూడి



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ‘సీతారామం’తో పాన్ ఇండియా దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న హను రాఘవపూడి మన బిడ్డే. కొత్తగూడెం గణేష్ టెంపుల్ గల్లీలో పుట్టి పెరిగి సినిమా ఇండస్ట్రీలో అందాల రాక్షసితో ప్రయాణం మొదలెట్టి ఇప్పుడు టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ దర్శకుల లిస్టులో చోటు సాధించారు. తాను చదివిన కాలేజీలో ఏర్పాటు చేసిన ఫంక్షన్‌లో పాల్గొనేందుకు చాన్నాళ్ల తర్వాత ఆయన కొత్తగూడెం వచ్చారు. ఈ సందర్భంగా ‘సాక్షి’తో ఆయన ముచ్చటించారు. కొత్తగూడెంతో తనకున్న అనుబంధం నెమరు వేసుకున్నారు, ఆ జ్ఞాపకాలు ఆయన మాటల్లోనే..

అసలు సినిమా ఆలోచనే లేదు..

నాన్న సన్యాసిరావు సింగరేణిలో ఉద్యోగం చేసేవారు. అమ్మ సూర్యకుమారి కోర్టులో ఎంప్లాయిగా ఉండేవారు. మా ఫ్యామిలీ గణేష్ టెంపుల్ వెనుక గల్లీలో ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏరియాలో ఉండేది. టెన్త్ వరకు రామవరం సింగరేణి స్కూల్‌లో, ఇంటర్మీడియట్ కృష్ణవేణి కాలేజీలో, డిగ్రీ వివేకవర్ధిని కళాశాలలో చదివాను. చిన్నప్పుడు అసలు సినిమాల్లోకి వెళ్లాలనే ఆలోచనే లేదు. అమ్మ చెప్పినట్టు బుద్ధిగా చదువుకోవడం మంచి మార్కులు తెచ్చుకోవడం మీదనే ధ్యాస ఉండేది. సినిమాలు చూడటం కూడా తక్కువే.

కానీ స్వాతికిరణం చూశాక..

చిన్నతనంలో ఓసారి మా అమ్మ దుర్గా టాకీస్‌లో స్వాతికిరణం సినిమాకు తీసుకెళ్లింది. ఆ వయసులో ఆ సినిమా నాకు విపరీతంగా నచ్చేసింది. అప్పటి వరకు సినిమాల మీద ఇంట్రెస్ట్ లేని నాకు ఆ సినిమాతో ఒక్కసారిగా సినిమాకి దర్శకుడు అనే వ్యక్తి ఎవరు ? అతను ఎలా ఆలోచిస్తాడు అనే అంశాలపై ఆసక్తి పెరిగింది. వెంటనే స్వాతికిరణం దర్శకుడు కే.విశ్వనాథ్ గురించి తెలుసుకోవడం ప్రారంభించాను. ఎంజీ రోడ్‌లో సంతోష్ వీడియో లైబ్రరీ నుంచి విశ్వనాథ్ గారి సినిమా క్యాసెట్లు అద్దెకు తీసుకెళ్లి సినిమాలో ఇంకో కోణంలో చూడటం మొదలెట్టాను. శంకరాభరణం సినిమా లెక్కలేనన్ని సార్లు చూశాను. అలా సినిమాలపై ఇష్టం పెరుగుతూ పోయింది. అయినప్పటికీ బుద్ధిగా చదువుతూనే ఎంసీఏలో ఉండగా సినిమాల్లోకి షిఫ్ట్ అయ్యాను.

ఆల్జీబ్రాకు బదులు స్క్రిప్ట్ రైటింగ్..

శంకరాభరణం తర్వాత కథకుడు, దర్శకుడు కావాలనే ఆలోచనకు బీజం పడింది. ఓ వైపు క్లాసులో టీచర్లు పాఠాలు చెబుతుంటే మరోవైపు నా మనసులో కథలు అందులోని పాత్రలు మెదిలేవి. ఇంటర్మీడియట్‌లో ఉన్నప్పుడు ఓ పత్రికలో కథల కాంపిటీషన్ అంటూ ప్రకటన వచ్చింది. దీంతో ఓ స్టోరీ రాసేసి ప్రైజ్ కొట్టేద్దామనుకున్నా. కాలేజీలో కోటేశ్వరరావు సార్ మ్యాథ్స్ క్లాస్ చెబుతున్నారు. నేను పైకి ఊ కొడుతూనే ‘హంతకుడు’ పేరుతో మంచి క్రైం స్టోరీ రాసేస్తున్నా. కాసేపటికి సార్‌కి డౌట్ వచ్చి నా నోట్స్ చెక్ చేశారు. అక్కడ ఆల్జీబ్రా బదులు ‘హంతకుడు’ కనిపించింది. అంతే అక్కడే సార్ వాయించేశారు. ఆ తర్వాత క్లాస్ బయట నిల్చోబెట్టారు. ఇప్పటిదాక స్వీట్ మెమరీగా మిగిలిపోయింది.

ఆ తర్వాత వీపు వాయించేశారు..

ఇంటర్‌లోకి వచ్చాక సినిమాలపై ఇష్టం బాగా పెరిగిపోయింది. పైగా కొత్తగూడెంలో సినిమా థియేటర్లు అన్నీ కృష్ణవేణి కాలేజీకి దగ్గర్లోనే ఉండేవి. ఉదయం కాలేజీకి వెళ్లినట్టే వెళ్లి మధ్యలో క్లాసులు ఎగ్గొట్టి మా గ్యాంగ్ అంతా సినిమాలకు వెళ్లే వాళ్లం. క్లాసులో స్టూడెంట్స్ సంఖ్య తగ్గినట్టు కనిపిస్తే, కోటేశ్వరరావు సార్ సీడీ 100 బైక్ వేసుకుని థియేటర్లకు వచ్చేవారు. ప్రొజెక్టర్ రూమ్‌లో నిల్చుని స్టూడెంట్స్ ఎవరెవరు ఉన్నారు ? ఎక్కడ ఉన్నారో గమనించేవారు. అలా ఓసారి మేం గులాబీ సినిమా చూసేందుకు పరమేశ్వరి థియేటర్‌లో ఉండగా సార్ మమ్మల్ని పట్టేసుకున్నారు. ఆ తర్వాత అందరి వీపులు వాయించేశారు. దీంతో ఎప్పుడైనా కాలేజ్ టైంలో సినిమాలకు వెళితే ‘సీడీ హండ్రెడ్ బైక్ ’ వచ్చిందా అంటూ మధ్యమధ్యలో చెక్ చేసుకునే వాళ్లం.

నెక్ట్స్ సినిమాలో కొత్తగూడెం..

నేను ప్రేమకథలు బాగా తీస్తానని, నాకో బ్యూటీఫుల్ లవ్‌స్టోరీ ఉందనే భావన చాలా మందిలో ఉంది. వాస్తవం కంటే ఊహలు ఎప్పుడూ అందంగా ఉంటాయి. టీనేజ్‌లో కానీ కాలేజ్ డేస్‌లో కానీ నాకు లవ్‌స్టోరీస్ ఏమీ లేవు. స్టడీస్, కథలు రాయడం మీదనే ఫోకస్ ఉండేది. కాకపోతే లవ్ చేస్తే ఎలా ఉండాలనే భావనలతోనే కథలు రాసుకున్న. వాటితోనే అందాల రాక్షసి, కృష్ణగాడి వీర ప్రేమగాథ, పడి పడి లేచే మనసు, సీతారామం వంటి సినిమాలు తీశాను. ఇప్పటి వరకు చేసినవన్నీ ఊహల్లోంచి పుట్టుకొచ్చిన కథలే. అందాల రాక్షసిలో పాత కారు, పగిలిన అద్దంలోని హీరోయిన్ కనిపించే దృశ్యం మాత్రం కొత్తగూడెం నుంచి తీసుకున్నా. నా చిన్నతనంలో గణేష్ టెంపుల్ గల్లీలో ఓ పాత కారు పార్క్ చేసి ఉండేది. కాలేజీకి, స్కూల్‌కు వెళ్లేప్పుడు ప్రతీ రోజు దాన్ని దాటుకుంటూ వెళ్లేవాణ్ని. ఆ ఒక్క సీన్‌ని సినిమాలో చూపించాను. త్వరలో మైత్రీ మూవీస్‌కి చేయబోయే సినిమాలో రియల్ లైఫ్‌లో కొత్తగూడెంలో చూసిన సంఘటనలు, ఎదురైన అనుభవాల్లో కొన్నింటిని సెల్యూలాయిడ్ తెర మీద చూపించబోతున్నాను.

బ్యాడ్ బాయ్‌ని కాదండోయ్...

సినిమాలపై ఇంట్రెస్ట్ ఉన్నా చదువును ఏ రోజూ నిర్లక్ష్యం చేయలేదు. టెన్త్, ఇంటర్, డిగ్రీలో మంచి మార్కులే వచ్చాయి. డిగ్రీ ఫైనలియర్‌లో కొత్తగూడెం నుంచి ఖమ్మం షిఫ్ట్ అయ్యాను. అక్కడ బ్యాంక్ కాలనీలో ఉంటూ కవిత డిగ్రీ కాలేజీలో చదివాను. ఆ సమయంలో ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌కి లెక్కల ట్యూషన్ చెప్పేవాన్ని. ఇంటర్‌లో పడిన పునాది గట్టిగా ఉండటంతో అది సాధ్యమైంది. స్టూడెంట్‌గా ఇంగ్లిష్‌తో నాకు ఎప్పుడు తిప్పలే ఉండేవి. చాతకొండ మూర్తి సార్ అయితే ‘ఇంగ్లిష్‌లో తక్కువ మార్కులు వచ్చాయంటూ , సమాధానం సరిగా చెప్పలేదంటూ’ ఎన్నిసార్లు కొట్టారో. అప్పుడు చెప్పిన పాఠాలు, తిన్న దెబ్బలు, సినిమాలపై నాకున్న ఇంట్రెస్ట్ అన్ని కలిపి నన్ను ఈ రోజు ఈ స్థాయికి తీసుకొచ్చాయి.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి..





- కుక్కల నివారణకు పటిష్టమైన చర్యలు
- పందులు, కోతుల బెడదనూ అరికడతాం
- ‘సాక్షి’ ఫోన్ ఇన్ కార్యక్రమంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

మణుగూరుటౌన్: పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. సాక్షి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలువురు ప్రజా సమస్యలు ఆయన దృష్టికి తేగా సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. పట్టణంలో అపరిశుభ్రత లేకుండా చూస్తామని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు సక్రమంగా లేవని, చెత్త సేకరణ సరిగా జరగడం లేదని, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు విన్నవించగా.. పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రశ్న: భగత్‌సింగ్ నగర్‌లోని రాధాకృష్ణ గెస్ట్ హౌస్ సమీప ప్రాంతంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలి. –ఆరీఫ్, భగత్‌సింగ్ నగర్

జవాబు: నేనే స్వయంగా రెండు రోజుల్లో మీ ప్రాంతానికి వచ్చి సమస్యలను పరిశీలిస్తాను. అవసరమైతే ఖాళీ స్థలం వారికి నోటీసులు ఇచ్చి చెత్త సేకరణ చేయిస్తాం. విద్యుత్ తీగల సమస్యపై విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపిస్తాం.

ప్ర : పాత ఆంధ్రా బ్యాంక్ ఎదురు సందులోని గ్యాస్ గోదాం సమీపంలో మురుగు కాల్వలు సక్రమంగా శుభ్రం చేయడంలేదు. ?
– కొంగర నాగేశ్వరరావు, ఆదర్శనగర్

జ: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలను నేను స్వయంగా సందర్శించి అక్కడ ఉన్న పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాం. ఆదర్శనగర్‌లో కూడా పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటాం.

ప్ర : భగత్ సింగ్‌నగర్‌కు ఈ నెలలో చెత్త సేకరణ వాహనాలు 3న, 18వ తేదీన మాత్రమే వచ్చాయి. దీంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వస్తోంది.
–ఎం. వెంకటరెడ్డి, భగత్‌సింగ్‌నగర్

జ: డ్రైవర్లు సమ్మె చేయడంతో కొన్ని ప్రాంతాలకు చెత్త సేకరణ వాహనాలు సరిగా రాలేదు. పారిశుద్ధ్య కార్మికులు సైతం సమ్మె చేయడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడిన మాట వాస్తవమే. నేటి నుంచి మీ ప్రాంతంలో చెత్త సేకరణ రోజూ జరిగేలా చర్యలు తీసుకుంటాం.

ప్ర : మున్సిపాలిటీలో కుక్కలు, కోతుల బెడద లేకుండా చూడాలి. అందుకోసం జంతు సంక్షేమ బోర్డు నుంచి సహాయ సహకారాలు అందిస్తాం. బ్లూక్రాస్ సొసైటీ సహకారంతో ఈ సమస్యకు పరిష్కారం చూపవచ్చు.
–సతీష్ , జంతుసంక్షేమ బోర్డు సీనియర్ సభ్యుడు

జ: మీ సలహాలు సూచనలు తప్పకుండా పాటిస్తాం . మీరు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు. మున్సిపాలిటీలో కుక్కలు, కోతుల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకుంటాం.

ప్ర : గోల్డ్‌షాపుల లైన్‌లో పందులు, కోతులు ఎక్కువగా తిరుగుతున్నాయి. ఎవరూ పట్టించుకోవడంలేదు.? –అశ్వక్, గోల్డ్ షాపు లైన్

జ: ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో రెండు సార్లు పందులను పట్టించాం. పందులను బయటకు రాకుండా చూసుకోవాలని పెంపకందారులకు నోటీసులు కూడా ఇచ్చాం. మరోసారి పందులు, కోతుల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

ప్ర : శేషగిరినగర్ ప్రాంతంలోని సురక్షా బస్టాండ్ ఏరియాలో గజ్జి కుక్కలు తిరుగుతున్నాయి. బయటకు వెళ్లాలంటే భయంగా ఉంటుంది. వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోగలరు?
–ఇలియాజ్, శేషగిరినగర్

జ: కుక్కల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకుంటాం. ఇళ్లలో కుక్కలు పెంచే వారు సైతం వాటిని బయటకు రాకుండా చూడాలి. ఆ ప్రాంతంలో సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని జంతు సంరక్షణ కేంద్రానికి తరలిస్తాం. కుక్కలను పెంచే వారు తప్పనిసరిగా వారి వివరాలను మున్సిపాలిటీలో నమోదు చేసుకోవాలి. వాటికి టీకాలు వేయించి, ఎప్పటికప్పుడు మున్సిపల్ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలి. మాంసం వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా దుకాణదారులకు నోటీసులు ఇస్తున్నాం . మున్సిపాలిటీ ప్రజలు సైతం ఊర కుక్కలకు ఇళ్ల ముందు ఆహార పదార్థాలు పెట్టొద్దు. కుక్కల నియంత్రణకు ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా సహకరించాలి.

అథ్లెటిక్స్‌లో మనోళ్లకు 14 పతకాలు..



పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో ఈ నెల 25,26వ తేదీల్లో జరిగిన, తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు 14 పతకాలు సాధించారు. ఈ మేరకు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. పోటీల్లో 20 మంది క్రీడాకారులు పాల్గొనగా, 14 మంది పతకాలు సాధించారని పేర్కొన్నారు. 9 బంగారు, 4 రజత పతకాలు, 1 కాంస్య పతకం సాధించారని తెలిపారు. పాల్వంచకు చెందిన ఆర్.అభినయ్ నాయక్, టేకులపల్లికి చెందిన జి.సిద్ధి వినయ్, కొత్తగూడేనికి చెందిన ఎం.ఇందు, ఎం.సంగీత ఏ.వందన, ఎం.అఖిల్, జె.వరుణ్ బంగారు పతకాలు సాధించారని వివరించారు. పాల్వంచకు చెందిన బి. దేఖేష్‌సామిత్, కొత్తగూడేనికి చెందిన ఎం.సింధు, ఏ.వందన రజత పతకాలు, రిలే పోటీల్లో అభినవ, అశోక్, అశిల, సామిత్ మరో రజత పతకం, పాల్వంచకు చెందిన కె.అశోక్ కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌లు పి.నాగేందర్, జన్ను, గిరిప్రసాద్, నరేష్, మల్లికార్జున్‌లను అసోసియేషన్ బాధ్యులు అభినందించారు..



స్విమ్మింగ్‌లో సాయిధనుష్‌కు ప్రథమ బహుమతి..

స్విమ్మింగ్‌లో సాయిధనుష్‌కు ప్రథమస్థానం

హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో చుంచుపల్లి మండలం(త్రీఇంక్లైన్)కు చెందిన రెడ్డిరాజుల సాయిధనుష్ బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో ప్రథమ, బ్యాక్ స్ట్రోక్ విభాగంలో ద్వితీయ బహుమతి పొందినట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నాయకుడు హనుమంతు తెలిపారు.

క్లుప్తంగా

ఆరోగ్య సమాజం కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రజాకవి జయరాజు

కొత్తగూడెంఅర్బన్: ఆరోగ్య సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ ప్రజాకవి, గాయకులు డాక్టర్ జి.జయరాజు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన ఆహారం, పద్ధతుల గురించి వివరించారు. ప్రాచీన వైద్య విధానాల ద్వారా భారతదేశం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైని ఉందని అన్నారు. అనంతరం వైద్యులు చింతా రవీందర్, హకీమ్, అనిల్ మాట్లాడుతూ ఆరోగ్య సలహాలు, సూచనల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు కనకరాజు, శైలజ, ఎంపీపీ వెంకటపుల్లయ్య, సుగుణారావు, మొక్కల వెంకటయ్య, శోభారాణి, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్



పట్టుబడిన వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

చండ్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామశివారు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను ఆదివారం సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ సీసీఎఫ్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు అయన్నపాలెం శివారులో తనిఖీలు చేపట్టామని, అక్రమంగా మట్టి తొవ్వకాలు చేపడుతున్న రెండు జేసీబీలు, 9 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. గ్రామాల్లో అనుమతి లేకుండా మట్టి తోలకాలు జరిపితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కారును దహనం చేసిన దుండగులు



మంటల్లో కాలిపోయిన కారు

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ సంజయ్‌నగర్‌లో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కారును దహనం చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. సంజయ్‌నగర్‌కు చెందిన వార్డు సభ్యుడు కోటి తన ఇంటికి సమీపంలో సైడ్ డ్రెయినేజీ నిర్మాణంలో ఉండటంతో మరోచోట పార్కింగ్ చేశాడు. ఆ కారుకు సమీపంలోనే అదే ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ తన కారును కూడా నిలిపిఉంచాడు. అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు వీధి దీపాలు నిలిపివేసి కారును దహనం చేశారు. కారు నుంచి మంటలు వస్తుండటంతో స్థానికులు గుర్తించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే కారు పూర్తిగా దహనమైంది. కోటికి సంబంధించిన కారు నుంచి వెలువడిన మంటలు ఇమ్రాన్ కారును కూడా అంటుకోవడంతో కారుముందు భాగం స్వల్పంగా దగ్ధమైంది. అప్పటికే స్థానికులు నిద్రలేవడంతో మంటలు ఆర్పి ఇమ్రాన్ కారును కాపాడారు. కోటి, ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ



తమ్మరపు వేణు(ఫైల్)

ఏన్కూరు: యాష్ ట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన తమ్మరపు వేణు (34) కూలి పనులు చేస్తు జీవనం సాగించేవాడు. ఎక్కడ పనిదొరికినా అక్కడ పనులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో భద్రాచలంలో కూలిపనులకు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని ఆదివారం సెలవు కావడంతో తన స్వగ్రామం బాణాపురం వేళ్లేందుకు ఆదివారం ద్విచక్రవాహనంపై తన భార్య శ్రావణి ఇద్దరు కుమార్తెలతో కలసి బయలుదేరాడు. మార్గమధ్యలో నల్లగొండ నుంచి పాల్వంచ వెళ్తున్న యాష్‌ట్యాంకర్ ఏన్కూరు సమీపంలో వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వేణు తీవ్ర గాయాలపాలయ్యాడు. కుమార్తెలకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వేణు మృతి చెందాడు. వేణు భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

మైదానం.. ఎప్పటికయ్యేనో..?



ఇల్లెందులో నిర్మించతలపెట్టిన మైదానం ఇదే..

- నిధులు లేక.. బిల్లులు రాక.. పనులు జాప్యం
- ఐదేళ్ల కిందట మొదలైన పనులు
- పాత రేట్లతో పనులు చేసి అప్పుల్లో కూరుకుపోయిన కాంట్రాక్టర్

ఇల్లెందు: క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చి.. ప్రతిభాపాటవాలు వెలుగులోకి తీసుకురావాల్సిన మైదానం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్లు గడిచినా పనులు ముందుకు సాగడంలేదు. సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేసినా సకాలంలో పనులు పూర్తి చేయక అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం పనులు ఐదు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. సరిపడా నిధులు లేకపోవటం .. బిల్లుల విడుదలలో జాప్యం కారణంగా పనులు జరగకపోవటం.. వెరసి మినీస్టేడియం ముందుకు సాగటం లేదు. ఇల్లెందు మినీ స్టేడియానికి జిల్లా యువజన, క్రీడల శాఖ (స్పోర్ట్స్ అథార్టీ) రూ. 2.65 కోట్లు నిధులు కేటాయించింది. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ నీటి పారుదల సంస్థ (ఇరిగేషన్) ఈ పనులు చేపట్టింది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేసింది. నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి 2013 ఏప్రిల్ 6న ఇల్లెందులో జరిగిన కార్యక్రమంలో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత స్థలం ఎంపికకు ఆరేళ్లు గడిచింది. ఆ ప్రభుత్వం పోయింది.

పథకం మూలకు పడింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2016లో మినీస్టేడియానికి రూ.2.65 కోట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ ద్వారా మంజూరు చేశారు. 2018లో మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య సింగరేణి సీఈఆర్ క్లబ్ స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ తర్వాత 2019 అక్టోబర్ 26న ప్రస్తుత ఎమ్మెల్యే హరిప్రియ శంకుస్థాపన చేశారు. ఇలా దాదాపు ఐదేళ్లు కావస్తున్నప్పటికీ 70 శాతం పనులు పూర్తయ్యాయని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

ఎంతో ప్రయోజనకరం..

మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే క్రీడాకారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. టేబుల్ టెన్నిస్ కోర్టు అందుబాటులోకి వస్తుంది. ఆడిటోరియం ఏర్పాటవుతుంది. జిమ్, కబడ్డీ కోర్టు, షటిల్ కోర్టు కూడా అందులో ఉండనున్నాయి. కోచ్‌లను కూడా నియమిస్తారు. దీంతో పలువురు క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ రూ.50 లక్షల వరకు ఒకే ఒక్క బిల్లు పొందారు. మరో రూ.70 లక్షల బిల్లు పాస్ కావాల్సి ఉంది. ఒకవైపు నిధుల విడుదలలో జాప్యం, పాత రేట్లతో పనులు చేయటం వల్ల కాంట్రాక్టర్ నష్టాల్లో కూరుకుపోయినట్లు తెలిసింది.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



పట్టణంలోని సింగరేణి గ్రౌండ్‌లలో వాకింగ్ చేసే వారు ట్రాక్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి వాకింగ్ ట్రాక్ లేక నడక అసౌకర్యంగా మారింది. గుంతలమయంగా ఉండే నేల మీద నడవటం ఒక్కోసారి ప్రమాదంగా మారుతోంది. స్టేడియం ఉంటే అక్కడే అన్ని సదుపాయాలు ఉంటాయి. తక్షణం మినీ స్టేడియం పూర్తి చేయాలి.

– పులి సైదులు, ఇల్లెందు

వ్యాయామం అవసరం



యువకుల నుంచి వృద్ధుల వరకు అందరికీ వ్యాయాయం అవసరం అవుతోంది. అందరూ జిమ్‌లకు వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. నడక, వ్యాయాయంతో పాటు యూత్ క్రీడలలో రాణించాలంటే స్టేడియం తప్పకుడా ఉండాలి. వివిధ రకాల క్రీడల్లో తర్ఫీదు పొందేందుకు అవకాశం ఉండే మినీ స్టేడియాన్ని సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావాలి.

– నర్సింహ, ఇల్లెందు

రామయ్యకు సువర్ణ పుష్పార్చన





హాజరైన భక్తులు (ఇన్‌సెట్) స్వామివారి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

8న స్వర్ణలక్ష్మి పూజలు

రామాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో వచ్చే నెల 8న సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వర్ణలక్ష్మి అమ్మవారి పూజా మహోత్సవం జరపనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజలో పాల్గొనే భక్తులు రూ.600 చెల్లించాలని, వారికి అమ్మవారి వెండి ప్రతిమ, జాకెట్ పీస్, ప్రసాదం, పూజా సామగ్రి అందజేస్తామని పేర్కొన్నారు. 7వ తేదీన హోలి రోజున రామచంద్ర స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరిస్తామని, ఆ రోజు నిత్యకల్యాణం నిలిపివేస్తున్నట్లు వివరించారు.

సేవ చేసే అవకాశాన్ని వదులుకోను..

- రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు
- పాల్వంచలో జీఎస్‌ఆర్ ట్రస్ట్ వైద్య శిబిరానికి విశేష స్పందన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీనివాసరావు

కొత్తగూడెంఅర్బన్/ పాల్వంచ: ఈ నియోజకవర్గానికి సేవ చేసే అవకాశం ఏ రూపంలో వచ్చినా సరే స్వీకరిస్తానని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద వైద్యశాలల సహకారంతో స్థానిక డీఏవీ పాఠశాలలో కేటీపీఎస్ ఉద్యోగులు, కార్మికులు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని ట్రస్ట్ నిర్వాహకులు, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, కేటీపీఎస్ సీఈలు పాలకుర్తి వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్, కె.శ్రీనివాసబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను హెల్త్ డైరెక్టర్ పదవిలో ఉన్నా లేకపోయినా, ఇతర ఏ పోస్టులో ఉన్నా తాను పుట్టి పెరిగిన ఈ ప్రాంతానికి సేవ చేయడం భాగ్యంగా భావిస్తానన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మౌలిక వసతులు, ఇతర అంశాల్లో ఇంకా అభివృద్ధి సాధించాల్సి ఉందని పేర్కొన్నారు. అనంతరం కేటీపీఎస్ అధికారులను, పలువురు కార్మిక సంఘాల నేతలను సన్మానించారు. ఈ క్యాంప్‌లో 30 మంది వైద్యులు 50 మంది సహాయ సిబ్బందితో 2,968 మందికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. 298 మందిని మెరుగైన వైద్యానికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జంగయ్య, ఎస్‌ఈ యుగపతి, డీఎంహెచ్‌ఓ శిరీష, కార్మిక సంఘాల నాయకులు కేవీ రామారావు, సుధీర్, చారుగుండ్ల రమేశ్, రాధాకృష్ణ, రామకృష్ణ, మాజీద్, కోటేశ్వరరావు, మంగీలాల్, చాట్ల శ్రీనివాసరావు, కాంపెల్లి కనకేశ్, సింధుతపస్వి, జోగారావు, వైద్యులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్ర కారాగారంలో పోటీ పరీక్షలకు సమాయత్తం అవుతున్న 200 మంది యువతకు ఆదివారం నుంచి మూడు నుంచి నాలుగు నెలల పాటు ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత వైఫై సౌకర్యం కల్పిస్తామని శ్రీనివాసరావు వెల్లడించారు.

టీపీఆర్‌ఎంఈఏ ఎన్నికల్లో వాగ్వాదం



మాట్లాడుతున్న విద్యాధర్ ప్యానల్ సభ్యులు

చుంచుపల్లి: పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీపీఆర్‌ఎంఈఏ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికలు వాగ్వాదం మధ్య ఆదివారం అర్ధంతరంగా రద్దయ్యాయి. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా టీఎన్‌జీఓస్ అధ్యక్షులు అమరనేని రామారావు పరిశీలకులుగా వ్యవహరిస్తున్న ఈ కమిటీ ఎన్నికలు రసాభాసా నడుమ నిలిచిపోయాయి. ఈ ఎన్నికల కోసం టి.అంకుబాబు, జి. శ్రీనివాసరావు ఒక ప్యానల్, డి.విద్యాధర్, ఎం.రాజేశ్ మరో ప్యానల్‌గా పోటీ పడ్డాయి. అందులో అంకుబాబు, శ్రీనివాసరావు ప్యానల్‌కు చెందిన నామినేషన్లలో కొన్ని తప్పులు దొర్లడంతో ఎన్నికల అధికారి వాటిపై అభ్యంతరం వ్యక్తం చేసి తిరస్కరించారు. దీంతో ఆ వర్గానికి చెందిన కొందరు వాగ్వాదానికి దిగారు. చివరకు ఎన్నికల అధికారిపై దురుసుగా ప్రవర్తించడంతో జిల్లా కమిటీ ఎన్నికల ప్రక్రియను రద్దు చేసి విషయాన్ని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షులు అమరనేని రామారావుపై ఎదురుదాడిని విద్యాధర్, రాజేశ్ ప్యానల్ సభ్యులు విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు.

భద్రాద్రి బాహుబలికి బంగారు పతకం



పతకం అందుకుంటున్న లోక్‌నాథ్

భద్రాచలంటౌన్: బాడీ బిల్డింగ్ పోటీలలో భద్రాద్రి బాహుబలికి మరో అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో శనివారం ముగిసిన స్టీల్ మ్యాన్ బాడీ బిల్డింగ్ పోటీలలో పట్టణానికి చెందిన బందారు లోక్‌నాథ్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పథకాన్ని సాధించారు. ఈ పోటీలలో ఐదు రాష్ట్రాల నుంచి 300 మందికిపైగా పాల్గొనగా లోక్‌నాథ్‌ను బంగారు పతకం వరించింది. గతంలో మిస్టర్ తెలంగాణగా ఎంపికైన లోక్‌నాథ్.. మిస్టర్ ఇండియా పోటీలకు సైతం అర్హత సాధించాడు.

సేవారత్న అవార్డుకు ఎంపికైన రాధ



జాతీయ సేవా రత్న అవార్డు ఎంపిక పత్రం అందుకుంటున్న గంటా రాధ

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దాన ధర్మ ట్రస్టు వ్యవస్థాపకురాలు గంటా రాధ బహుజన సాహిత్య అకాడమి వారు అందజేసే జాతీయ సేవా రత్న అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతు మీదుగా ఎంపిక పత్రం అందుకుంది. మణుగూరు వంటి మారుమూల ప్రాంతాల్లో దాన ధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో అనేక రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తున్నందుకు రాధకు ఈ అవార్డు ఇస్తున్నామరు.

కేసు నమోదు

భద్రాచలంటౌన్: భార్యపై దాడి చేసి ఆమెను తీవ్రంగా గాయపరిచిన భర్తపై పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని లంబాడీకాలనీకి చెందిన రాంప్రసాద్ ఖాళీగా తిరుగుతుండడంతో భార్య నాగరాణి గొడవ పడింది. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో రాంప్రసాద్ భార్యను రోకలిబండతో తలపై కొట్టాడు. దీంతో తీవ్రరక్త స్రావం కావడంతో కుటుంబసభ్యులు మొదట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాంప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.

విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం



సైన్స్‌ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందాల



మాట్లాడుతున్న రవిమారుత్

ఖమ్మంరూరల్: హార్వెస్ట్ విద్యాసంస్థల యాజమాన్యం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలో స్ప్రింగ్ లీఫ్ పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషిచేయడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోలేపల్లి పరిధిలోని కరుణగిరి ప్రాంతంలో గల స్ప్రింగ్‌లైఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పెద్దపెద్ద విద్యాసంస్థలు ఖమ్మం నగరంలోనే ఉండటం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు అక్కడికి వెళ్లి చదువుకోవడం ఇబ్బందికరమేనన్నారు. ఇలాంటి తరుణంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాలయాన్ని ప్రారంభించడం శుభపరిణామమని తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ హార్వెస్ట్ యాజమాన్యం జిల్లా విద్యారంగానికి చేస్తున్న సేవ అనిర్వచనీయమని పేర్కొన్నారు. కరస్పాండెంట్ పి.రవిమారుత్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న విద్యా పోటీలో తమ విద్యాసంస్థల ద్వారా ఒత్తిడిలేని, మానసిక వికాసంతో కూడిన ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ సభ్యుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత ఆదివారం మృతి చెందింది. స్థానిక హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన బైగాని రజని (33) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఈ క్రమంలోనే తాను కుటుంబానికి భారంగా మారుతున్నట్లు మనస్తాపానికి గురై ఈ 13వ తేదీన ఇంట్లో కుటుంబీకులు లేని సమయంలో పురుగుల మందు తాగింది. గుర్తించిన భర్త సర్వేశ్వరరావు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హైదారాబాద్ తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రొక్కం వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కిష్టారం గ్రామానికి చెందిన వ్యక్తి..

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బోడు ఎస్‌ఐ రంజిత్ కథనం ప్రకారం.. కిష్టారం గ్రామానికి చెందిన మాడె ఎర్రయ్య (47) ఈనెల 13న తన మోటార్ సైకిల్‌పై మధ్యాహ్నం బోడు గ్రామానికి వెళ్లాడు. మధ్యలో పారికలవాగు దాటాక అదుపుతప్పి రోడ్డు పక్క వాగులో పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. అటువైపు వస్తున్న వ్యక్తి చూసి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో గాయాలపాలైన ఎర్రయ్యను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. ఆదివారం మృతుడి కుమారుడు మాడె వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మందుపాతర పేలి సీఆర్‌పీఎఫ్ జవాన్...

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ జవాన్ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్‌స్టేషన్ నుంచి స్థానిక సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్ 16వ బెటాలియన్‌కు చెందిన జవాన్లు రోడ్డు తనిఖీ చేసుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓర్చాకు 3 కిలోమీటర్ల దూరంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి హెడ్ కానిస్టేబుల్ సంజయ్ లక్రా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అక్కడి నుంచి స్టేషన్‌కు తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ఆర్మీ హెలికాప్టర్ ద్వారా నారాయణ్‌పూర్‌కు, అనంతరం మృతుడి స్వగ్రామం జష్‌పూర్‌కు తరలించారు. కాగా, సంజయ్ అంత్యక్రియలు సోమవారం అధికారిక లాంచనాలతో నిర్వహించనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ములుగురూరల్: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో ఆదివారం ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పిపడడంతో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు గ్రామానికి చెందిన తాడూరి మనోహర్–లావణ్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఈనెల 21న హుస్నాబాద్ మండలం సందిళ్ల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై తిరుగుపయాణం అయ్యారు. ఈ క్రమంలో చల్వాయి గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంబానికి లావణ్య(33) తల తగలడంతో తీవ్ర గాయాలపై అక్కడికక్కడే మృతి చెందింది. మనోహర్, ఇద్దరు పిల్లలకు గాయాలు కాగా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పస్రా ఎస్సై కర్ణాకర్‌రావు తెలిపారు.

సాగర్ కాలువలో పడి యువకుడు మృతి



సాగర్ కాలువలో గోపాలకృష్ణ మృతదేహం

కల్లూరు: నాగార్జునసాగర్ ఎడమకాలువ కల్లూరు డివిజన్ పరిధిలోని మధిర బ్రాంచ్ కెనాల్ వద్ద కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ వెనుక ఆదివారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ రఘు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు తల్లాడ మండలం ముద్దునూరు గ్రామానికి చెందిన మిరియాల సత్యనారాయణ కుమారుడు గోపాలకృష్ణ (27) గా గుర్తించారు. గోపాలకృష్ణ హోమ్‌డిజైనర్ కార్మికునిగా పని చేస్తున్నాడు.

సింగరేణి ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌పై దాడి

సింగరేణి(కొత్తగూడెం): విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్స్‌పై దాడిచేసిన ఘటన ఆదివారం సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో చోటుచేసుకుంది. షీటీమ్ ఎస్‌ఐ పి.రమాదేవి కథనం ప్రకారం.. సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్ వరుణ్య.. అక్కడే పనిచేస్తున్న స్కావెంజర్‌కు పనిచెప్పారు. స్టాఫ్ నర్స్ చెప్పిన పనిని చేయకపోవటమే కాకుండా ఆమెపై దుర్భాషలాడుతూ దాడి చేశారు. సమాచారం అందుకున్న షీటీం ఎస్‌ఐ రమాదేవి ఘటనా స్థలానికి చేరుకుని స్కావెంజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా...



ప్రధాని మోదీతో ఏపీ గవర్నర్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఢిల్లీ పర్యటనకు వచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆదివారం ప్రధాని, కేంద్ర హోం మంత్రి, మాజీ రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారంతా జస్టిస్ నజీర్‌కు అభినందనలు తెలిపారు.

నాటుపడవ బోల్తా
ఆరుగురు గల్లంతు..

పొదలకూరు: సరదాగా చెరువులో విహరించాలన్న యువకుల సంతోషం విషాదంగా మారింది. ఒక గ్రామానికి చెందిన పది మంది యువకులు నాటు పడవలో చెరువులో షికారుకెళ్లి ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో నలుగురు సురక్షితంగా బయటపడగా, ఆరుగురు గల్లంతయ్యారు. ఈ ఘోర దుర్ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు కొత్త చెరువులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. విషయం తెలుసుకుని గ్రామస్తులందరూ చెరువు వద్దకు చేరుకున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం తోడేరుకు చెందిన పముజుల బాలాజీ (20), బట్ట రఘు (20), అల్లా శ్రీనాథ్ (16), మన్నూరు కళ్యాణ్ (30), చల్లా ప్రశాంత్‌కుమార్ (16), పాడి సురేంద్ర (16), ఏనుగు విష్ణు (18), ఎ. కిరణ్ (18), ఒంటేరు మహేంద్ర (20), ఒంటేరు మహేష్ (19) సా.5.30 గంటల ప్రాంతంలో చెరువులో నాటు పడవలో షికారుకెళ్లారు. చెరువు మధ్యలోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏనుగు విష్ణు, ఒంటేరు మహేంద్ర, ఒంటేరు మహేష్, ఎ. కిరణ్ ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మిగిలిన ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఈ సమాచారం తెలుసుకున్న పొదలకూరు సీఐ జీ సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరీముల్లా గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టినా గల్లంతైన యువకుల ఆచూకీ దొరకలేదు.

ఏసీపీ నేతృత్వంలో నవీన్ హత్యకేసు దర్యాప్తు

- హరిహరకృష్ణతోపాటు స్నేహితులను ప్రశ్నించేందుకు సిద్ధమైన పోలీసులు
- నిందితుడి కస్టడీ కోసం నేడు కోర్టులో పిటిషన్ వేసేందుకు ఏర్పాట్లు


హరిహరకృష్ణ


నవీన్(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్యకేసులో దర్యాప్తు అధికారిగా వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయన నేతృత్వంలో పలు పోలీసు బృందాలు లోతుగా దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలను రాబట్టే పనిలో నిమగ్నమయ్యాయి. ఘటన జరిగిన ప్రదేశానికి కొద్దిదూరంలోనే విజయవాడ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఉన్నాయని.. వాటిని పరిశీలిస్తే నవీన్, హరిహరకృష్ణతోపాటు ఇంకా ఎంతమంది అక్కడికి వచ్చారనేది తేలనున్నట్టు పోలీసులు చెప్తున్నారు. ఇక నవీన్‌ను హత్య చేసిన ప్రాంతానికి దగ్గరగా ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట, బాటసింగారం ప్రాంతాలపై హరిహరకృష్ణకు ముందే స్పష్టమైన అవగాహన ఉన్నట్టు భావిస్తున్నారు. శివారు ప్రాంతాలు కావడం, పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలు ఉండటంతో.. నిర్మానుష్య ప్రాంతాలను ఎన్నుకుని గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం. నవీన్, హరిహరకృష్ణ, వారి స్నేహితులు గతంలో గంజాయికోసం ఈ ప్రాంతాలకు వచ్చి ఉంటారని, ఈ క్రమంలోనే హత్యకు నిర్మానుష్య ప్రాంతాన్ని సులువుగా ఎంచుకుని ఉంటాడని భావిస్తున్నారు.

నిందితుడి కస్టడీ కోసం నేడు పిటిషన్

ఈ కేసులో నిందితుడు హరిహరకృష్ణను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. ఈ హత్యకు సంబంధించి హరిహరకృష్ణ, నవీన్ స్నేహితులను కూడా విచారించనున్నట్టు సమాచారం. నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ.. ఆ తర్వాత నవీన్ స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డులు బయటికి వచ్చాయి. హరిహరకృష్ణ హత్యకు పాల్పడిన ఆందోళన, భయం వంటివేమీ లేకుండా మాట్లాడిన తీరు విస్మయానికి గురిచేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిందితుడి అన్నకూ నేర చరిత్రే..

ఖిలా వరంగల్: స్నేహితుడిని దారుణంగా హత్య చేసిన హరిహరకృష్ణ స్వస్థలం వరంగల్‌లోని కరీమాబాద్ ప్రాంతం. తండ్రి స్థానికంగా ఆర్‌ఎంపీ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. హరిహరకృష్ణ అన్న ముఖేశ్ గతంలో ఓ హత్యానేరంలో జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు హరిహరకృష్ణ తాను ప్రేమించిన యువతి కోసం స్నేహితుడిని దారుణంగా హత్యచేయడం కరీమాబాద్ ప్రాంతంలో కలకలం రేపింది.

నవీన్ తల్లిదండ్రులు మమ్మల్ని క్షమించాలి

ఇద్దరు ప్రాణ స్నేహితులు ఒకే అమ్మాయిని ప్రేమించడం దురదృష్టకరమని.. అయినా తప్పు చేసినవారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని నిందితుడు హరిహరకృష్ణ తండ్రి పేరాల ప్రభాకర్ పేర్కొన్నారు. తన కొడుకును ఉన్నతంగా చూడాలని అనుకున్నానని, కానీ ఇలా అవుతుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన కొడుకును తానే స్వయంగా పోలీసులకు అప్పగించానని వివరించారు. నవీన్ తల్లిదండ్రులకు తీరని లోటు జరిగిందని.. వారు తన కుటుంబాన్ని పెద్ద మనసుతో క్షమించాలని విజ్ఞప్తి చేశారు.


విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో హరియాణాలోని కురుక్షేత్రలో 16 రోజులపాటు జరిగిన లక్ష చండీ మహా యజ్ఞం ఆదివారం మహా పూర్ణాహుతితో ముగిసింది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ..ఈ భూమండలంపై లక్ష చండీ మహా యజ్ఞం జరిగిన తొలి ప్రాంతంగా కురుక్షేత్రలోని గుంతీ గ్రామం చరిత్రలో నిలుస్తుందని తెలిపారు. లోక కల్యాణార్థం ఇలాంటి కార్యక్రమాలు రాజుల కాలంలో చేపట్టినట్లు చరిత్ర ద్వారా తెలుసుకున్నామని, ఇప్పుడు కళ్లారా చూశామని తెలిపారు. భారతావనికి కచ్చితంగా శుభ దినం కాగలదని ఆకాంక్షించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర మాట్లాడుతూ ఇది మహత్తర యజ్ఞమని అభివర్ణించారు. –సింహాచలం


సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు ఆదివారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉగాది తర్వాత గొర్రెల పంపిణీ

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రెండో విడత గొర్రెల పంపిణీ ఉగాది, శ్రీరామనవమి పండగల తర్వాత చేపడతామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖమంత్రి టి.హరీశ్‌రావు ప్రకటించారు. గొర్రెల ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ పథకం యూనిట్ వ్యయాన్ని కూడా పెంచుతామన్నారు. ఆదివారం సంగారెడ్డిలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం, కురుమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ రూ.300 కోట్లతో హైదరాబాద్‌లో గొల్ల, కురుమల ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వం గొల్ల, కురుమలను వాడుకుందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.2 వేల కోట్లతో సరిపెట్టి, బీసీలకు అన్యాయం చేస్తోందని హరీశ్ విమర్శించారు. కురుమ సామాజిక వర్గంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగేవని, కల్యాణలక్ష్మి పథకం అమలు చేసిన తర్వాత ఈ బాల్యవివాహాలు బంద్ అయ్యాయన్నారు. రాష్ట్రంలో గొల్ల, కురమలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కర్ణాటక మాజీ మంత్రి రేవన్న సీఎం కేసీఆర్‌ను కలిసి గొంగడి కప్పి అభినందించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ విషయంలో రేవన్నకు ఏఐసీసీ నోటీసులు కూడా జారీ చేసిందన్నారు. సభలో ఎంపీలు బీబీపాటిల్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, మాణిక్‌రావు, హెచ్‌డీసీ రాష్ట్ర చైర్మన్ చింతప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, గొల్ల కుర్మ సంఘం నేతలు నగేశ్, శ్రీహరి, పాండు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి హరీశ్‌రావుకు గొంగడి కప్పిన కురుమలు

తొలి గంటలో బిడ్డకు ముర్రుపాలు

సాక్షి, హైదరాబాద్: పుట్టిన తొలి గంటలో తల్లి నుంచి బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ, మాతా శిశు సంరక్షణ కేంద్రాలలో గర్భిణులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 'బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్‌నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల్లో సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఇందుకోసం మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లో లాక్టేషన్‌వర్కర్లను నియమించనున్నారు. దీంతోపాటు మాతా శిశు సంరక్షణ యూనిట్లలో తల్లిపాలకేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని ఆస్పత్రుల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వస్తున్నట్లు వైద్య వర్గాలు చెప్పాయి. తొలిగంటలోనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల అనేకరకాల జబ్బుల నుంచి రక్షణ ఏర్పడుతుంది. ఆరు నెలలపాటు తల్లిపాలు మాత్రమే తాగిస్తే..ఐదేళ్లలోపు పిల్లల మరణాలను 22% నివారించవచ్చని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువ శాతం సిజేరియన్ ద్వారానే బిడ్డను బయటకు తీయడం వల్ల వారు తొలి గంటలో ముర్రుపాలకు దూరమవుతున్నారు. ఆ సమయంలో బిడ్డకు తల్లి పాలిచ్చే పరిస్థితి ఉండటంలేదు. ఈ పరిస్థితిని నివారించేందుకే బ్రెస్ట్ ఫీడింగ్‌పై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

గుంటూరులో..


టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టకపోయినా, కొట్టారని పాత ఫొటోలతో ప్రజలను మోసం చేసిన ఈనాడు దిగజారుడు పాత్రికేయ విలువలకు వ్యతిరేకంగా గత మూడు రోజులుగా ఏపీ వ్యాప్తంగా ప్రజల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. ఆదివారం కూడా ప్రజలు, వివిధ సంఘాల నేతలు, పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనాడు తీరును నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

జిల్లా వార్తలు

పెద్దమ్మతల్లి ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న రమేష్

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచ నవనగర్‌కు చెందిన పి.రమేష్ రూ.1,01,116 విరాళాన్ని ఆలయ ఈఓ రజనీకుమారికి ఆదివారం అందించారు. రమేష్ దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేసినట్లు ఈఓ తెలిపారు. కాగా, కొత్తగూడెం బర్మా క్యాంప్‌నకు చెందిన పొలుమూరి భానుప్రసాద్ – కీర్తి దంపతులు అమ్మవారికి రూ.57 వేల విలువైన 10 గ్రాముల బంగారు ముక్కుపుడకను బహూకరించగా, వారికి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశామని చెప్పారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి
ఒకరోజు ఆదాయం రూ.24,500


బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలిరావడంతో ప్రాజెక్టు పరిసరాలు కోలాహలంగా మారాయి. సందర్శకులు డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 387 మంది పర్యాటకులు తరలి రావడంతో వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.13,410, 220 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.11,190 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రతిభ నై.. పైరవీలకే సై..



- క్రీడాకారుల ఎంపికల్లో అవినీతి, అక్రమాలు
- ముడుపులు ముట్టజెప్పేవారికి పెద్దపీట
- జిల్లా సంఘాలను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర సంఘాలు
- ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న 'శాట్స్'

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడా సంఘాల ముసుగులో దోపిడీ జరుగుతోంది. ఔత్సాహిక క్రీడాకారులు, ప్రతిభావంతులను పక్కనబెట్టి ప్రతిభ లేని వారిని జిల్లా, రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తున్నట్లు ఆరోపణలు వస్తుండగా.. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పేలవమైన ప్రదర్శనతో వెనుదిరుగుతున్నారు. జట్టులో ఎంపిక కోసం ఒక్కో క్రీడాకారుడి నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా జిల్లాలోని కొన్ని క్రీడా సంఘాలపై ఉన్నాయి. అయితే ఈ అవినీతిలో రాష్ట్ర క్రీడా సంఘాలే జిల్లా సంఘాలను ప్రోత్సహిస్తున్నాయనే విమర్శలు లేకపోలేదు. కాగా, రాష్ట్ర జట్టులో స్థానం కోసం పెద్ద ఎత్తున నిధులను రాష్ట్ర సంఘాలకు ఇవ్వాల్సి ఉండడంతో తాము తప్పక వసూలు చేయాల్సి వస్తోందని జిల్లా బాధ్యులు చెబుతుండడం గమనార్హం. ఉదాహరణకు కనీసం పదిమంది ఉండాల్సిన జట్టులో పూర్తిస్థాయి ప్రతిభ కలిగిన ఐదుగురికే చోటు కల్పిస్తున్నారని సమాచారం. మిగతా ఐదుగురిని ఏ జిల్లా నుంచి అధిక మొత్తంలో రాష్ట్ర సంఘం బాధ్యులకు ముడుపులు చెల్లిస్తే ఆ జిల్లా వారికే స్థానం కల్పిస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు. ఏటా జిల్లా క్రీడా సంఘాలు జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహించే సమయంలోనే అందులో డబ్బు ఉన్న వారి తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి 'మీ అబ్బాయి లేదా మీ అమ్మాయికి మంచి భవిష్యత్ ఉంది. అయితే, రాష్ట్ర జట్టులో ఎంపిక చేయడానికి ఖర్చు అవుతుంది.. ఎంత ఇస్తారో చెప్పండి' అని అడుగుతుండడంతో తల్లిదండ్రులు కూడా డబ్బు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారని సమాచారం.

'శాట్స్'లో కొరవడిన నిఘా..

గత కొంత కాలంగా క్రీడాకారుల ఎంపికల విషయంలో పూర్తిస్థాయి ఆధిపత్యం క్రీడా సంఘాలకే ఉండటం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) ఎలాంటి నిధులను ఆయా క్రీడా సంఘాలకు విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలోని క్రీడాసంఘాలు అడ్డూఅదుపు లేకుండా ప్రవర్తిస్తున్నాయనే విమర్శలు బాగా వినిపిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్ల నుంచి క్రీడా సంఘాలకు శాట్స్ ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో వాటిపై నిఘా కొరవడింది. దీంతో క్రీడాసంఘాలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో జరిగే వివిధ క్రీడా పోటీలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకులను నియమిస్తారు. వారిది ఈ పోటీల్లో మొక్కుబడి పాత్రే ఉంటుంది తప్ప జట్టు ఎంపికలో సెలక్షన్ కమిటీకి ఎలాంటి సూచనలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేగాక సదరు పరిశీలకులకు సంబంధిత క్రీడకు బదులు ఇతర క్రీడలకు పరిశీలకులుగా నియమిస్తుండడంతో క్రీడా సంఘాలు ఆడిందే ఆటగా మారుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా, రాష్ట్ర ఒలింపిక్ సంఘాలు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా సంఘాల మీద పట్టు కోల్పోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లా ఒకటి.. ఆడేది ఇంకో జిల్లా !

కొన్ని క్రీడా సంఘాల్లోని బాధ్యులు సొంత జిల్లా తరఫున ఒక జట్టు, ఇతర జిల్లాల తరఫున మరో జట్టు ఆడే విధంగా జిల్లా నుంచి రెండు జట్లను ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు తీసుకెళుతున్నట్లు తెలిసింది. అయితే రెండో జట్టులో ఉండే క్రీడాకారులు ఒకరిద్దరు సీనియర్ క్రీడాకారులను పెట్టి ఫలానా జిల్లా నుంచి కూడా క్రీడాకారులు వచ్చారని, వారికి ఎంపికల్లో ఆవకాశం కల్పిస్తున్నామని రాష్ట్ర సంఘం బాధ్యులు ప్రకటిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని క్రీడాంశాల్లో ఇలా రెండు జట్లను తీసుకెళ్లి రాష్ట్ర టోర్నీలో ఆడించడం ఎంత వరకు సబబు అని పలువురు సీనియర్ క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా క్రీడాకారుల ఎంపిక విషయంలో రాష్ట్ర ఒలింపిక్ సంఘం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ పటిష్ట నిఘాను పెంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ సంఘాలతో బేజారు..

జిల్లాలో కొన్ని నకిలీ క్రీడాసంఘాలు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులే లక్ష్యంగా ఎంచుకుని దందా కొనసాగిస్తున్నారు. ముందస్తుగా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు లేకుండా జాతీయ, అంతర్జాతీయ పోటీలకు తీసుకెళ్లడం లాంటి సంఘటనలు నిత్యం జిల్లాలో కొనసాగుతున్నాయి. అయితే కొందరు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ ప్రాబల్యం కోసం నేరుగా జాతీయ, అంతర్జాతీయ పోటీలను ఆడిస్తామని నామమాత్రమైన ప్రతిభ లేని క్రీడాకారులను ఎంపిక చేసుకుని నేరుగా అంతర్జాతీయ పోటీల పేరిట విదేశాలకు తీసుకెళ్తున్నారు. ఇలాంటి పరిణామాలపై ఇప్పటికే కలెక్టర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులు నిఘా వేశారు. ఈ క్రమంలోనే అంతర్జాతీయ స్థాయి పోటీలకు అనధికారికంగా వెళ్లిన / వెళ్తున్న క్రీడాకారుల వివరాలను సమీకరిస్తున్నారు. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

ఉష్ణతాపం.. కళా విహీనం..!


ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఎండదెబ్బకు చెట్లు మాడిపోతున్నాయి. ఆకులు రాలి చెట్లు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. కొత్తగూడెం ఎంజీ రోడ్‌లోని భారీ రావి వృక్షం వేసవి కాలానికి తలవంచింది. ఆకులు నేలరాలడంతో మోడువారింది. చాలామంది చిరువ్యాపారులు, బాటసారులకు ఈ చెట్టు నీడనిచ్చేది. ప్రస్తుతం ఆకురాలి మోడువారినా.. చిగుళ్లు రాకపోతాయా.. మునుపటి చల్లటి నీడ మళ్లీ దొరకకపోతుందా అనే ఆశతో వ్యాపారులు ఆ చెట్టు అడ్డాను వీడడం లేదు. - చుంచుపల్లి

జాతీయ టోర్నీకి ఐదుగురు ఆర్చర్ల ఎంపిక


జాతీయ టోర్నీకి ఎంపికైన ఆర్చర్లు వీరే..

ఖమ్మం స్పోర్ట్స్ : గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా ఆర్చరీ ఫలితాలను సీనియర్ పురుషుల విభాగంలో సాధించి ఐదుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లానుంచి ప్రాతినిధ్యం వహించిన ఆర్చర్లు కె.లక్ష్మణ్, వి.పృథ్వీ, పి.నగేష్, ఈ.ఆనంద్ రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ ఎంపికల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపిక కాగా, శివసాయి కాంపౌండ్ విభాగంలో జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఉమ్మడి జిల్లా నుంచి ఒకేసారి ఐదుగురు జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియషన్ అధ్యక్షులు సాధుల సారంగపాణి, కార్యదర్శి పుట్టా శంకరయ్య, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జాతీయ సీనియర్ ఆర్చరీ టోర్నీ గుజరాత్ రాష్ట్రం ఏక్తానగర్‌లో మార్చి 9నుంచి 18 వరకు జరగనుంది.

భారత ఉషూ జట్టుకు అన్నాచెల్లెలు ఎంపిక


పి.సత్యజిత్


పి.పవిత్రాచారి

ఖమ్మం స్పోర్ట్స్ : ఉషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 2, 3 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు జిల్లాకు చెందిన అన్నాచెల్లెలు ఎంపికయ్యారు. సీనియర్ పురుషుల జట్టుకు రాష్ట్రం నుంచి పి.సత్యజిత్, మహిళల జట్టుకు పి.పవిత్రాచారి ప్రాతినిధ్యం వహించనున్నారు. కాగా సత్యజిత్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించగా, జాతీయస్థాయిలో పవిత్రాచారి ప్రతిభ చాటింది. పరిమితంగా ఎంపికలు నిర్వహించే పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు, అది కూడా అన్నాచెల్లెలు ఉండడం విశేషం. తండ్రి వద్ద శిక్షణ తీసుకుని అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న పి.సత్యజిత్, జాతీయ స్థాయిలో తిరుగులేని ఉషూ క్రీడాకారులుగా రాణిస్తున్న పవిత్రాచారి ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి అభినందించారు.

50 ఏళ్ల తర్వాత.. అ'పూర్వ' కలయిక !

వారంతా తాజా పూర్వ విద్యార్థులు కారు.. సుమారు 50 ఏళ్ల క్రితం.. 1968 – 72 సంవత్సరాల మధ్య ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో డిగ్రీ చదివారు. నగరంలోని గ్రాండ్ గాయత్రి హోటల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి కెమిస్ట్రీ లెక్చరర్ కె.సూర్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ 'విద్యార్థులు' నాటి స్మృతులను నెమరవేసుకున్నారు. అనేక మంది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో స్థిరపడటంతో అధ్యాపకులు, తోటి స్నేహితులు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వి.వెంకట్రావు, కోటేశ్వరరావు, సైదులు, సీతారాములు, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మం సహకారనగర్



నాటి లెక్చరర్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు